నమ్మలేని నిజాలు

వృద్ధ ప్రబోధం
సర్వం స్వయం ఆధారం
బోధి వృక్షం.
చలి తీవ్రత
వజవజ వణుకు
చలినాగులు.
మేధకు పని
పనికి తగ్గ మనీ
రోబో మనిషి.
మంచి చెడులు
ఎంచిచూడగ రెండు
జీవితం సాగు.
ఆట ఒకటే
ఎఱ్ఱ తెల్లబంతులు
ఎరుపునయం.
- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

శ్రీనిజాలు

అధికారంలో ఉండగ
పదేళ్లుగా పన్నీరా?
కథనమంత నిజమేనా
కవిత కంట కన్నీరా?
ఎట్ల పోయి ఎట్లవునో
ఇంటి బిడ్డ పోరు !
చరిత్రలో చెరిగిపోనా
కన్న తండ్రి పేరు!
- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 8-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:125 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేలా సంక్రాంతి కార్యక్రమాలు

హైదరాబాద్, జనవరి 7:ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు.

ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## ప్రియురాలి మృతి.. తట్టుకోలేక పెట్రోల్ పోసుకొని ప్రియుడు ఆత్మహత్య

హైదరాబాద్, జనవరి 07: ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. నిన్న(మంగళవారం) రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో పూజ అనే 17 ఏళ్ల యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తమ బిడ్డ ఆత్మహత్యకు కారణం అదే గ్రామానికి చెందిన సిద్దగోని మహేష్ అని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇవాళ(బుధవారం) మహేష్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లె సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని.. నిప్పంటించుకుని తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో కూడా వీరిద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడి కోలుకున్నారు. గత కొంతకాలంగా మహేష్, పూజ ప్రేమించుకున్నట్లు సమాచారం. ఇలా ప్రేమ కారణంగా అనేక మంది యువతీ యువకులు క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. కొందరు హత్య చేస్తుండగా.. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రేమలో మోసపోయామని కొందరు, పెద్దలు ఒప్పుకోలేదని మరికొందరు ఇలా తమ నూరేళ్ల జీవితాన్ని అర్థాంతరంగా ముగిస్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో 26 మంది మావోయిస్టుల సరెండర్

న్యూఢిల్లీ, జనవరి 7:ఛత్తీసగఢ్‌లో బుధవారం మరికొంత మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు. సుక్మా జిల్లాలో సీనియర్ పోలీసు అధికారులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల ముందు 26 మంది లొంగిపోయారు. వీరిలో 13 మందిపై రూ. 65 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. పోరుబాట వీడిన వారి పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పూనా మార్గెమ్ కార్యక్రమంలో భాగంగా నక్సల్స్ లొంగిపోయినట్టు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. గెరిల్లా దళాలతో పాటు దక్షిణ బస్తర్, మాడ్ డివిజన్, ఆంధ్ర ఒడిశా బార్డర్ డివిజన్‌లో ఈ మావోయి స్టులు క్రియాశీలకంగా ఉండేవారని ఎస్పీ తెలిపారు.తాజాగా లొంగిపోయిన వారిలో లాలీ అలియాస్‌పై ముచాకీ లఖ్మాపై అత్యధికంగా రూ.10 లక్షల రివార్డు ఉంది. కోరాపుట్ రోడ్డులో 2017 నాటి ఐఈడీ బాంబు పేలుడు ఘటనలో లఖ్మా పాత్ర ఉందని పోలీసులు తెలిపారు. నాటి ఘటనలో 14 మంది భద్రతా సిబ్బంది మరణించారని చెప్పారు. హెమ్లా లఖ్మా, అస్మితా అలియాస్ కామ్లూ సాన్నీ, పదమ్ జోగీ, సందమ్ పాలేలపై రూ.8 లక్షల చొప్పున రివార్డు ఉంది. మావో బాట వీడిన జనజీవన స్రవంతిలోకి వచ్చిన వీరికి తక్షణ ఆర్థిక సాయంగా ఒక్కొక్కరికీ రూ.50 వేలు ఇచ్చినట్టు కూడా ఎస్పీ తెలిపారు. ఇతర మావోయిస్టులు కూడా తక్షణం హింసామార్గాన్ని వీడాలని పిలుపునిచ్చారు. జనజీవన స్రవంతిలో కలిసే వారందరికీ భద్రమై, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని హామీ ఇచ్చారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు మృతి..

న్యూఢిల్లీ, జనవరి 7:బంగ్లాదేశ్ లో మరో హిందువు మరణించాడు. స్థానికులు దాడికి ప్రయత్నిస్తుండగా పారిపోతూ ఒక కాలువలో దూకి, ప్రాణాలు కోల్పోయాడు. నౌగావ్ జిల్లాలోని, మొహదేవపూర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మృతుడిని 25 ఏళ్ల మిథున్ సర్కార్ గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిథున్ సర్కార్ ను చోరీ చేశాడనే నెపంతో స్థానికులు గుంపుగా వెంటాడి పట్టుకునేందుకు ప్రయత్నించారు.

ఈ క్రమంలో మిథున్ పారిపోతూ పక్కనే ఉన్న కాలువలో దూకి రక్షించుకోవాలనుకున్నాడు. కానీ, కాలువలో దూకి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడి మృతదేహాన్ని ఫైర్ సిబ్బంది సహాయంతో బయటకు తీసి, పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు. ఇటీవలి కాలంలో బంగ్లాలో హిందువులు సహా మైనారిటీలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. 2024 నుంచి ఈ దాడులు జరుగుతుండగా.. గత నెల నుంచి తీవ్రస్థాయికి చేరాయి. అందులోనూ గత నెలలో అక్కడి విద్యార్థి నేత షరీఫ్ ఒస్మాన్ హదీ హత్య తర్వాత హిందువులపై దాడులు పెరిగిపోయాయి.దీపు చంద్రదాస్, ఖోకోన్ చంద్ర దాస్, మణి చక్రవర్తి వంటి పలువురు హిందువులపై అక్కడి మూకలు దాడిచేసి హత్య చేసిన సంగతి తెలిసిందే. 2022 లెక్కల ప్రకారం బంగ్లాదేశ్ లో 13.1 మిలియన్ల హిందువులున్నారు. అంటే అక్కడి జనాభాలో 7.9 శాతం.

## ఎన్డీయే కూటమిలో చేరిన పీఎంకే



చెన్నై, జనవరి 7: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే, బీజేపీ కూటమి తో పట్టాలి మక్కల్ కట్చి చేతులు కలిపింది. పీఎంకే అధ్యక్షుడు అంబుమణి రామదాన్ తమిళనాడు మాజీ సీఎం, అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామిని కలుసుకుని ఎన్డీయే కూటమిలో చేరుతున్నట్టు ప్రకటించారు.

అంబుమణి రామదాస్‌తో కలిసి పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ, పీఎంకే చేరికతో తమ కూటమి మరింత బలపడిందని, మరి కొన్ని పార్టీలు కూడా తమతో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయన చెప్పారు. తమది 'విక్టరీ అలయెన్స్' అని ప్రకటించారు.

అన్నాడీఎంకే నాయకత్వంలో ఎన్డీయేలో చేరేందుకు పీఎంకే చేతులు కలిపినట్టు అంబుమణి రామదాస్ తెలిపారు. మహిళల భద్రత, రైతులు, నిరుద్యోగం వంటి అంశాల్లో అధికార డీఎంకేపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, డీఎంకేను గద్దె దించడమే లక్ష్యంగా తాము పనిచేసామని చెప్పారు. భారీ మెజారిటీతో గెలిచి అన్నాడీఎంకే నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఈ ఏడాది ప్రథమార్ధంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## ప్రమాదాల నివారణలో డ్రైవర్ల ఆరోగ్యమే కీలకం : డీటీఓ రఘునందన్ గౌడ్



హైదరాబాద్, జనవరి 7: రోడ్డు ప్రమాదాల నివారణకు ఆరోగ్యం సైతం ఖ్యమని మేడ్చల్ రవాణా శాఖ జిల్లా అధికారి రఘునందన్‌గౌడ్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసం ఉత్సవాల సందర్భంగా బుధవారం మేడ్చల్ రవాణా శాఖా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పలు వాహనాల డ్రైవర్లకు పలు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డీటీఓ రఘునందన్‌గౌడ్ మాట్లాడుతూ.. వాహనాలను నడిపే సమయంలో మనం ఆరోగ్యంగా, ఏకాగ్రతతో ఉన్నప్పుడే ప్రమాదాలను నివారించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

ప్రతి ఒక్కరు వాహనాలను నడిపే సమయంలో ఆరోగ్యం విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు సురక్షితంగా గమ్యస్థానాలను చేరేంత వరకు ప్రతి ఒక్కరు రోడ్డు నిభందనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటర్ ఇన్‌స్పెక్టర్లు సాదుల శ్రీనివాస్, ఎంఆర్ శిల్ప, ఎఎంవిఐ త్రివేణిబాయి, కిరణ్‌కుమార్‌లతో పాటు ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

## హైదరాబాద్ శివారులో ప్రమాదం.. శివరాంపల్లి వద్ద మినీ లారీ బోల్తా

హైదరాబాద్, జనవరి 7: హైదరాబాద్ శివారులో మినీ లారీ బోల్తా పడింది. శివరాంపల్లి వద్ద ఆరాంఘర్ నుంచి అత్తాపూర్ వైపు వెళ్తున్న ఓ మినీ లారీ టైరు పేలడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు.

బుధవారం ఉదయం ఆరాంఘర్ నుంచి ఇటుక లోడ్‌తో వెళ్తున్న మినీ లారీ శివరాంపల్లి వద్ద పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 289 వద్దకు రాగానే టైరు పేలి బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వెనుకాల ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు రోడ్డుపై పడిన ఇటుకలను, జీహెచ్ఎంసీకి సంబంధించిన జేసీబీ సాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు. లారీ బోల్తాపడి రోడ్డుకు అడ్డంగా ఉండటంతో కాసేపు ట్రాఫిక్ స్తంభించింది.

## ఎయిరిండియా విమానంలో కిలో గంజాయి పట్టివేత.. శంషాబాద్ విమానాశ్రయంలో కలకలం

హైదరాబాద్, జనవరి 7: హైదరాబాద్‌లోని శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మరోసారి గంజాయి కలకలం రేపింది.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో గంజాయి పట్టుబడింది. విదేశాల్లో సాగు చేస్తున్న హైడ్రోఫోనిక్ గంజాయి దాదాపు కిలో వరకు దొరికింది.

పట్టుబడిన గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలకు బయపడిన నిందితులు విమానంలోనే ఈ గంజాయిని వదిలివెళ్లినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

నిందితుల కోసం అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఇటీవల విదేశాల్లో సాగు చేస్తున్న హైడ్రోఫోనిక్ మట్టి లేకుండా సాగు చేసే గంజాయిని ఇండియాకు తరలించడం ఇటీవల పెరిగింది.

ఈ తరహాలో విదేశాల నుంచి గంజాయిని తీసుకొస్తున్న వారిపై డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు నిఘా పెంచారు.

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు మోదీ ఫోన్.. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ

న్యూఢిల్లీ, జనవరి 7: భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు బుధవారం ఫోన్ చేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని మోదీ ఎక్స్ లో వెల్లడించారు. 'స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాను. ఇరుదేశాల సంబంధాలను ఈ ఏడాది మరింత బలోపేతం చేయడంపై చర్చించాం.

ప్రాంతీయ పరిస్థితుల గురించి చర్చించాం. తీవ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని కచ్చితమైన నిర్ణయంతో ఉన్నాం' అని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక సంబంధాలు, వివిధ అంశాల్లో సహకారం, ప్రగతిపై ఇరు దేశాల ప్రధానులు హర్షం వ్యక్తం చేశారు. రక్షణ, భద్రతా సంబంధాలను మరింత బలోపేతం చేయడం, తీవ్రవాదాన్ని అణచివేయడం వంటి అంశాలపై మాట్లాడారు. అలాగే మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని తాజా పరిస్థితులపై చర్చించారు.

శాంతి, స్థిరత్వం కోసా పాటు పడాలని నిర్ణయించారు. గత నెలలోనే నెతన్యాహు.. మోదీకి ఫోన్ చేశారు. గాజాతో కాల్పులు విరమణ అంశంపై చర్చించారు. నెతన్యాహు గత నెలలోనే ఇండియాలో పర్యటించాల్సి ఉంది. అయితే, వివిధ కారణాలో వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల ప్రధానులు పలు అంశాలపై చర్చించడం ఆసక్తికరంగా మారింది.

## ఐ బొమ్మ రవికి షాక్..

హైదరాబాద్, జనవరి 7:సినిమాల పైరసీ కేసులో అరెస్టైన ఇమంది రవి అలియాస్ ఐ బొమ్మ రవికి నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది.

అతడి బెయిల్ పిటిషన్లను కొట్టి వేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అతడిపై ఐదు కేసులు నమోదు అయ్యాయి. ఈ ఐదు కేసుల్లో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రవి కోర్టును ఆశ్రయించాడు. తాజాగా, ఈ బెయిల్ పిటిషన్‌లపై నాంపల్లి కోర్టు విచారణ జరిపింది. కేసు దర్యాప్తు దశలో ఉందని, అతను విదేశాల్లో పౌరసత్వం కలిగి ఉన్నాడని పోలీసులు కోర్టుకు తెలిపారు. బెయిల్ ఇస్తే దేశం దాటిపోయే అవకాశం ఉందని కోర్టుకు విన్నవించారు. దీంతో కోర్టు రవి బెయిల్ పిటిషన్‌లను కొట్టి వేసింది.

### కస్టడీ రిపోర్టులో కీలక విషయాలు

ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు గత బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగు చూశాయి. ఐబొమ్మ రవి రెండు రకాలుగా సినిమా ప్రింట్‌లను కొనుగోలు చేశాడు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఐబొమ్మ రవి తన సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసులు తెలుసుకున్నారు.

**చురక**

నిధులకై సర్పంచులు
నిరీక్షంచే పరిస్థితి
గతంనుండి నేటిదాకా
గిట్లెందుకు దుస్థితి
గతితప్పి పోదా ఇంకా
గ్రామాల్లో అభివృద్ధి
సర్కారు నిర్యక్ష్యం
చంపేయదా లక్ష్యశుద్ధి



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

ముద్ద తిననని నాడు
ముద్ద నిడనని నేడు
కొడుకేడిపిస్తాడు
అనును రాధశ్రీ.
శాత్రవుల రుధిరమ్ము
ప్రియురాలి అధరమ్ము
మధురాతి మధురమ్ము
అనును రాధశ్రీ.



-రాధశ్రీ
సెల్:9494481210

## తిరుమలను దర్శించుకున్న మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోగుల్

తిరుపతి, డిసెంబర్ 17: మారిషస్ దేశ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోగుల్ తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనా రాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మహాద్వారం వద్ద స్వాగతం పలికారు.

నిన్న రాత్రిఈ సందర్భంగా శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి చేరుకున్న మారిషస్ అధ్యక్షుడికి టీటీడీ జేఈవో వి. వీరబ్రహ్మం సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం పూర్తయ్యాక ధరమ్ బీర్ గోగుల్‌కు జేఈవో తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, సీవీఎస్వో కె.వి.మురళీకృష్ణ, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. శిలాతోరణం వరకు క్యూలైన్లో భక్తులు

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. నిన్నస్వామివారిని 82,022 మంది భక్తులు దర్శించుకోగా 20,230 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టమెంట్లు నిండిపోయి బుధవారం శిలాతోరణం వరకు క్యూలైన్లో నిలబడ్డారు.

టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.48 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలి : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్, జనవరి 7: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మహబూబ్ నగర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

పోటీకి అవకాశం రానివారికి భవిష్యత్ లో మంచి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం లోనే మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఏర్పాటయ్యిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లేని లోటు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. గ్రామాల్లో పర్యటనకు వెళ్తే ప్రజలు సమస్యలు ఏకరువు పెడుతున్నారు.

మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమాను వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి రంగలకు ప్రాధాన్యత ఇచ్చామని, మెడికల్ కాలేజీ తో పాటు వేయి పడకల అస్పత్రి తీసుకువచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణంలో ఉన్న పనులు చాలా వరకు ఆగిపోయాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పూర్తి చేయలేదని విమర్శించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు హితబోధ చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు హైదరాబాద్ తో సమంతరంగా మహబూబ్ నగర్ అభివృద్ధి చేస్తామన్నారు.

# మౌనగీతం (కథ)

-చల్లా భానుకిరణ్,
సెల్: 9010234313.

నాటి తరం వారి కథలు నేటి తరానికి
## కథల వంతెన

**కడుపుతో ఉన్న నన్ను అసలు కాలు కింద పెట్టనివ్వలేదు. నాకు అన్నీ తానే అయ్యి నాకంటి పాపలా మారి నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నాడు. అమ్మానాన్న కూడా ఈయన ప్రేమని చూసి నా పూర్వజన్మ సుకృతం అన్నారు.**

ఎంతసేపయ్యిందో తెలీదు గాని చాలా సేపట్నుంచి నేను ఎదురుచూస్తూ కూర్చున్నా నని మాత్రం స్పష్టంగా చెప్పగలను. ఇంత కూడా అర్థం కూడా చేసుకోడేంటి మనిషిని. నాకూ మనసుందని, నాకూ ఇష్టాలుంటా యని అసలు అర్థం చేసుకోడు. ఎంతసేపు తన గురించే తన ఇష్టాల గురించే తప్ప నా ఫీలింగ్స్ గురించి అస్సలు పట్టించుకోడు. ఏం మనిషిండీ బాబూ.

పెళ్లయిన కొత్తలో కూడా ఇంతే. పెళ్లయిన కొత్తలో ఏంటీ.. పెళ్లి చూపుల దగ్గర్నుంచే. పెళ్లి వాళ్లొస్తున్నారు అని మా పాలేరు చెప్పేసరికి ఆసక్తి చంపుకోలేక ఇంటి పెరటిగోడ మీద నుండి కాళ్లెత్తి చూసా. ఎక్కడ్నుండి చూసాడో ఏమో ఈ మహానుభావుడు... నన్ను చూసేసాడు. ఆ విషయం అప్పటికి నాకు తెలీదు. పెళ్లి చూపులవుతున్న టైమ్‌లో కాఫీ గ్లాస్ అందిస్తుంటే నాకు మాత్రమే వినపడేటట్టు అన్నాడు.. మీకు రెండు జడలే బావుంటాయి. అలాగే కంటిన్యూ అవండి. మరో విషయం.. అలా గోడ చాటు నుండి చూడకండి. దిష్టి తాకుతుంది. అని అనేసరికి నాకు చల్లగా చెమటలు పట్టేసాయి. నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు. మీరు చాలా బావుంటారు అని మళ్లీ నవ్వుతూ అన్నాడు. చప్పున తలవంచుకుని పరిగెత్తుకుంటూ నా గదిలోకి వచ్చేసాను. మా ఫ్రెండ్స్ అంతా నా వెనకే వచ్చారు. ఏంటే.. గురుడు ఏదో గుసగుసలాడాడు అని వాళ్లు అంటుంటే జరిగిందంతా చెప్పేసాను. మాంచిఫాస్టే అని వాళ్లు నవ్వేసారు. అప్పటికి నేను కూడా నవ్వుకున్నాను కానీ జరిగే ఉపద్రవాన్ని మాత్రం కనిపెట్టలేకపోయాను.

ఉపద్రం అంటే కొంపమునిగేదే అని గ్రహించారు కదా. అవునండి.. నిజంగా నా కొంపముంచేదే.. అదే.. ఆయనకి నేనంటే ఎంత ప్రేమ అంటే..ఆఖరికి ఆయన ఊపిరి తీసుకోవడం కూడ ఆపేసి నేను ఊపిరి తీసుకుంటున్నానా లేదా. నేను బాగున్నానా లేదా నేను సమయానికి తంటు న్నానా లేదా, నేను ఆయురారోగ్యాలతో ఉన్నానా లేదా,.. అబ్బబ్బ.. ఎన్నని చెప్పను. ఇదే వరస ఈయనకి. అరే..కొంచం నీ గురించి కూడా పట్టించుకోవయ్యా మగడా అంటే అసలు వినడే. పెళ్లి రోజున ఏం జరిగిందో తెలుసా..

పెళ్లి మండపంలో అందరు బిజీగా ఉన్నారు. నా తలమీద జీలకర్ర, బెల్లం పెడుతున్న సమయంలో సడన్‌గా తుమ్ము లొచ్చి తుమ్మాను.. అంతే.. ఎంత పెద్ద రభస చేసాడనుకున్నాడు. వెంటనే డాక్టర్ అటెండ్ అయ్యి నాకే ప్రాబ్లమ్ లేదు, మామూలుగా వచ్చిన తుమ్మే అని చెప్పేవరకు ఆయన పెళ్లికానివ్వలేదు. ఇంత జాగ్రత్త పరుడేంటే.. అంటే నీకు ఏ రోగవో ఉంటే తనకు సమస్యగా తయారవుతానేమోనని బెంగేమోనే అని నా ఫ్రెండ్స్ పద్మజ అంటుంటే కావ చ్చేమో అని అనిపించింది. కానీ పెళ్లయిన మర్నాడు మా శోభనం జరిగిన రాత్రి తెలిసింది. ఆయనకి నేనంటే ఎంత పిచ్చి ప్రేమో, నా ఒంటికి ఎక్కడ నొప్పి కలుగుతుందోనని సెన్సిటివ్‌గా దగ్గరకు తీసుకుంటూ చంటిపాపలా లాలిస్తూ నేను తప్ప మరే ప్రపంచం లేని వాడిగా బతుకుతున్నాడని చెప్పకనే చెప్పిన అమాయకుడి మహాను భావుడైన మొగుడు గారు.

..అబ్బా.. ఇంకెంతసేపు వెయిట్ చేయాలి.. ఇంకా రాడేంటి.. కూర్చునీ కూర్చుని కాళ్లు నొప్పులు లేస్తున్నాయి. ఈయన వస్తే తొందరగా వెళ్దామంటే అసలు రాడే.. ఆ.. ఎంత వరకు చెప్పాను.. ఆ.. శోభనం.. రోజు అలా జరిగింది. కదా.. ఇక మా కొత్త కాపురం కర్నూల్‌కి షిఫ్ట్ చేసాం.. కడప నుండి కర్నూలు, అంటే కాస్త దగ్గరే అయినా అమ్మానాన్నలను వదిలి వెళ్లాలంటే బెంగగా అనిపించింది. ఈయనకేమో కొత్త ఉద్యోగం, ఎక్కువ రోజులు సెలవులు కూడా ఇవ్వలేదు. ఇక తప్పనిసరి పరిస్థితిలో ఈయనతో కర్నూలుకి వచ్చాను. ఎస్.పి. ఆఫీస్ దగ్గరలో మా ఇల్లు. నాతో పెళ్లి నిశ్చయమయిన కొని రోజులకీ ఈ ఇల్లు కొనేసారట. మా పెళ్లయిన ఆర్నెల్లవరకు మా కాపురం సజావుగానే సాగింది. నేనాడిందే ఆట, నాను పాడిందే పాట. నా కనుసైగల్లో అన్నీ అమరిపోయేవి. ఇప్పటికీ కూడా అనుకోండి. కాకపోతే నా మీదున్న ప్రేమను షేర్ చేస్కోవడానికి కడుపులో పడింది పల్లవి. అదిగో అది కడుపులో పడటం ఆలస్యం.. ఈయనకి నేను అపురూపంగా మారాను. నన్ను ఎంత జాగ్రత్తగా చూస్కోవడం స్టార్ట్ చేసాడంటే అంతరించిపోతున్న అరుదైన జీవులను ఎంత జాగ్రత్తగా కాపాడుకుంటారో అంత జాగ్రత్తగా అన్నమాట.

కడుపుతో ఉన్న నన్ను అసలు కాలు కింద పెట్టనివ్వలేదు. నాకు అన్నీ తానే అయ్యి నాకంటి పాపలా మారి నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నాడు. అమ్మానాన్న కూడా ఈయన ప్రేమని చూసి నా పూర్వజన్మ సుకృతం అన్నారు. నేను లేబర్ రూమ్‌లోకి వెళ్లినపుడు నా పెయిన్స్ చూసి ఈయన చిన్నపిల్లాడిలా ఏడ్వడం గమనించాను. అందుకే ఎంత పెయిన్ వచ్చినా పంటి బిగువున భరించాను. ఆయన ఏడుస్తుంటే భరించలేను మరి. ఏమైతేనేం.. పల్లవి పుట్టింది. అది పుట్టిన దగ్గర్నుంచి ఈయనకి అదికూడా ప్రాణమైంది. అందరు తండ్రులకు పిల్లలంటే ప్రాణమే. కానీ ఈయనకి మాత్రం అంత కన్నా ఎక్కువ. నేనూ, పల్లవి ఆయనకి రెండు కళ్లుగా మారాం.

పల్లవి ఫిఫ్త్ క్లాస్ చదువుతున్నప్పుడు అభినవ్ కడుపులో పడ్డాడు. వాడు పుట్టాక ఇక మా ఫ్యామిలీని చూసి కుళ్లుకోని వారుండరంటే నమ్మండి. పిల్లలు ఎదుగుతున్నారండీ.. కాస్త మీ ఎమోషన్స్‌ని కంట్రోల్ చేస్కోండి. అంటే వినరే.. అదే..పద్ధతి.. సాధన లేకుండా నేను లేను. సాధనే నా ప్రాణం సాధనే నా ఊపిరి.. అంటూ నా గురించే ఆయన కలవరించడం ఒక్కోసారి చిరాకు కూడా తెప్పించేవి. ఈయన నేను లేకపోతే ఎక్కడ బెంగపెట్టుకుంటారో అని పుట్టింటికి కూడా వెళ్లడం తగ్గించాను. వెళ్లినా ఉదయం వెళ్లి సాయంత్రం కల్లా వచ్చేయడం. మరి ఈయన ఆఫీస్ నుండి వచ్చేసరికి నేను కనపడకపోతే తల్లడిల్లిపోతారు. అదీ ఆయన పద్ధతి.

పల్లవి ఇంటర్ చదువుతున్నపుడు అనుకుంటా పల్లవికి జాండీస్ వచ్చింది. డాక్టర్లు వచ్చి పల్లవిని చూసారు. మందులిచ్చారు. పర్వాలేదని చెప్పారు. అయినా ఈయన వినరే. చిన్నపిల్లాడిలా ఏడుస్తూ దేవుళ్లకు మొక్కుతూ తిరుపతికి వస్తానని, కాలినడకన కొండ ఎక్కుతానని. దండం పెట్టుకున్నారు. వారానికల్లా పల్లవి కోలుకుంది. ఆ మర్నాడే అందరం తిరపతి బయల్దేరాం.

మా అందర్నీ కార్‌లో పంపించి తను మాత్రం కొండమీద నుండి నడుచుకుంటూ వచ్చాడు. పిల్లలంటే అంత ప్రేమ, తపన ఆయనకు. ఇక నా విషయం అంటారా.. ఇంత సేపూ చెప్పాను కదా, ఒక విషయం మాత్రం ఎప్పటికీ మరిచిపోలేను. నేను అభినవ్ పుట్టిన పదో రోజుకో ఏమో గుర్రపువాతం వచ్చి కళ్లు తేలవేసానట. ఈయన ఎంతగా అల్లాడిపోయారో మా అమ్మ చెప్తే తెలిసింది. డాక్టర్ల కాళ్లు మొక్కడం, నా చుట్టే తిరగడం,..నన్ను చూస్తూ ఏడ్వడం.. నేను కోలుకునేవరకు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టుకోకుండా ఉన్నారట. నేను కాస్త కోలుకునే సరికి పెద్దగా నవ్వేసాడు. నేను నవ్వితే నవ్వుతాడు. నేను ఏడిస్తే ఏడుస్తాడు. ఏం మొగుడండీ బాబూ, ఒకసారి మేమందరం పిక్నిక్ కని శ్రీశైలం వెళ్లాం. అక్కడ ఈయన కాసేపటి వరకు కనపడ కుండా పోయాడు. ఏమైందో ఏమోనని కంగారు పడ్డాం. చివరకు ఈయన ఎక్కడున్నారో తెలుసా.. అక్కడ బిక్షగాళ్లతో కూర్చుని మంతనాలు చేస్తున్నారు. ఏంటయ్యా అంటే వాళ్లల్లో ఎవరికో చావు లేకుండా చేసే మూలిక గురించి తెలునట. అది ఎక్కడ సంపాదించాలా అని అడుగుతున్నాడు. నేను ఒక్క కసురు కసిరి ఆయన్ను లాక్కొచ్చాను. మీకేమైనా పిచ్చా.. చావు లేకుండా చేసే మూలికలు ఎక్కడా ఉండవు. అసలు చావు లేకుండా ఎవరూ ఉండరు అని అన్నాను. ఆయన నెమ్మదిగా.. ఆ మూలిక నాకోసం కాదు సాధన. నీకూ పిల్లల కోసం.. అని ఆయన అంటుంటే కళ్లల్లో నీళ్లు ఆగలేదు.

పల్లకి ఇంజనీరింగ్ పూర్తి చేసింది. అమెరికాలో జాబ్ వచ్చింది. పల్లవి అమెరికా వెళ్తానంది. ఈయనకు అక్కడకు పంపడం ఇష్టం లేదు. ఈయనగారి పెద్దమ్మ కూతురు అంటే ఈయనకు అక్క వరసయ్యే శారద కొడుకు రేవంత్. అతను కూడా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జాబ్ చేస్తున్నాడు. రేవంత్‌ని పల్లవికిచ్చి పెళ్లిచేద్దామంది శారద. నేను సరే అన్నాను. కానీ ఈయనే. అసలు వినడే. పాపని వదిలేసి వండలేను అంటాడు. నేనే బుజ్జగించి వాళ్ల భవిష్యత్ నీ దృష్టిలో పెట్టుకోండి అని నచ్చ చెప్పి రేవంత్‌తో పల్లవి పెళ్లి చేసాను. పల్లవి అమెరికా వెళ్లిపోయింది. అభినవ్ హైదరాబాద్‌లో హైటెక్ సిటీలో జాబ్ చేస్తున్నాడు. కర్నూలులో ఇపుడు మేమిద్దరమే.

పిల్లలకి రెక్కలొచ్చి ఎగిరిపోతే గూడు ఖాళీ అయిపోయినట్టుగా అనిపించింది. నేను ఏదో కాలక్షేపం ఉండే దాన్ని. ఆయనే సడన్‌గా పిల్లలను గుర్తు తెచ్చుకుని మూడీగా మారేవాడు. నేనే కబుర్లు చెప్పి, పిల్లలతో ఫోన్‌లో మాట్లాడించి ఆయనను ఊరడించేదాన్ని. ఒకరోజు పల్లవికి పిల్లాడు పుట్టాడని ఫోన్ చేసింది. షాక్ అయ్యాం. ఎపుడు ప్రెగ్నెంట్ అయ్యిందో, ఎపుడు నెలలు నిండాయో ఏమీ తెలీదు. అంతలా సీక్రెట్ మెయింటైన్ చేయాల్సిన అవసరం ఏంటో అర్థం కాలేదు. అదే విషయం ఆయన అడిగితే మీరిలా సెంటిమెంటల్ ఫీల్ అవుతారనే చెప్పలేదు డాడీ. ఇక్కడంతా ఫాస్ట్ కల్చర్. మీకు చెప్తే రెస్ట్ అని, ఆరోగ్యమనీ చెప్తారు. వర్క్ డిస్ట్రబ్ అవుతుందని చెప్పలేదు. ఇపుడు బాబూ, నేనూ సేఫ్, త్వరగలోనే వస్తాం.. అని పల్లవి. ఫోన్ పెట్టేసింది. ఆయనా నేనూ ఇద్దరం షాక్ నుండి తేరుకోలేదు. ఇంతలోనే మరొక షాక్ నుండి తేరుకోలేదు. అంతలోనే మరొక షాక్. అభినవ్ వచ్చాడు. ఒక్కడు రాలేదు. వెంట ఎవరో అమ్మాయి. ఆమెను పరిచయం చేస్తూ తన పేరు కుల్సానా అని తన కొలిగ్ అని త్వరలో పెళ్లి చేస్కోవాల నుకుంటున్నానని చెప్పాడు. మేమిద్దరం మాట్లాడుకొనే అవకాశం కూడా ఇవ్వలేదు. తనకు సంబంధించిన ప్రైజెస్, మెడల్స్ ఆ అమ్మాయికి చూపించి మమ్మల్ని పరిచయం చేసి వెంటనే వెళ్లిపోయాడు వాడు.

ఏంటి సాధనా.. ఏం జరుగుతుంది.. అని నీరసంగా ఆయన అడిగేసరికి నేనూ విరక్తిగా అన్నాను. ఏదో జరుగుతుంది అని మాత్రం అర్థమవుతుందని కానీ జరిగేది మాత్రం మనకు సంబంధం లేదని మాత్రం కచ్చితంగా అర్థమవుతుంది.. అని అనేసరికి ఆయన కళ్లల్లో నీళ్లు ఆయనని గుండెలకు అనించుకుని ఓదార్చాను. నేనూ ఏడిస్తే ఆయన అసలు భరించలేడు మరి.

అభినవ్ పెళ్లి కుల్సానాతో అయిపోయింది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి లండన్ వెళ్లిపోయారు. ఇపుడు మేమిద్దరమే, నేను ఆయనకి, ఆయనకి నేను. కొన్నాళ్ళు కన్నీళ్లు మింగుతూ, మరి కొన్నాళ్లు ప్రేమను పంచుకుంటూ బతికాం. ఒకరోజు హఠాత్తుగా నాకు హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆయనకు గుండె ఆగినంత పనయ్యింది. నన్ను హాస్పిటల్‌లో చేర్చారు. పిల్లలకు ఫోన్స్ చేసి వెంటనే రమ్మని ఏడ్చేసారు. పిల్లలకు నేను అప్పటికే రెండు ఉత్తరాలు రాసాను. ప్రేమలను, ఆత్మీయతలను మరిచిపోయి డబ్బుకోసం దూరాలను చేరుకుని బంధాలను దారపుపోగుల్లాగా చేసుకోకండిరా.. మేమంటూ ఉన్నామని మరిచిపోకండి. అని రాసాను. ఉత్తరాలు నా దిండుకిందే ఉన్నాయి. పల్లవి, వాళ్లయన వాళ్ల బాబూ ప్రణవ్, అభినవ్, అతని భార్య, కుల్సానా, వాళ్ల పాప రేష్మ.. వచ్చారు. ఆ ఉత్తరాలను వాళ్లకిచ్చానను. వాళ్లల్లో ఏదో మార్పు, తప్పు చేసాం మమ్మీ.. సారీ అంటూ ఏడ్చేసారు. ఈయన కోసం చూసాను. ఈయన కనపడలేదు. పిల్లలూ వెదికారూ ఒకరోజు గడిచింది. అయినా ఈయన జాడలేదు. పిల్లలు బాధపడుతున్నారు. నాకు చప్పున గుర్తొచ్చింది. వెంటనే శ్రీశైలం వెళ్లమని చెప్పాను. అభినవ్, రేవంత్ ఇద్దరూ బయలుదేరి వెళ్లారు.

ఈయన నేననుకున్నట్టుగానే శ్రీశైలంలో బిచ్చగాళ్లతో కూర్చుని చావురాని మూలిక కోసం వాళ్లని అడుగుతున్నాడు. వాళ్లల్లో కలిసిన ఈయన కూడా బిచ్చగాడిలా కనపడ్డాడని రేవంత్ అంటుంటే కడుపుతరుక్కుపోయింది. వాళ్లు ఏదో అడ్రస్ చెప్పడంతో అక్కడకు బయల్దేరడానికి ఈయన సిద్ధమవుతుంటే వీళ్లు వెళ్లి తీసుకొచ్చారట. ఈయన రాగానే నా దగ్గర కూర్చుని బాధగా అన్నాడు. నన్ను అక్కడికి వెళ్లనిస్తే బాగుండేది కదా సాధనా.. అది చావు రాని మూలికట, ప్లీజ్ నన్ను వెళ్లనివ్వవా.. అని ఆయన అంటుంటే ఆయనకున్న ప్రేమకి కరగిపోయాను, ఆయన్ను ఆర్తిగా దగ్గరకు తీసుకున్నాను. ఆయన నా చేతులకు దొరకడం లేదు. ఏమండీ.. ఏమండీ.." అని అరుస్తున్నాను. ఆయన నా పక్కనే కూర్చుని నన్ను పొదివి పట్టుకుని ఏడుస్తున్నాడు. నాకు మాత్రం ఆయన దొరకడం లేదు.

నన్ను నేను చూసుకున్నాను. నేను చాలా ఎత్తులో ఉన్నాను. వాళ్లు మాత్రం కిందనే ఉన్నారు. నాకు వాళ్లెవరూ వద్దు. ఆయన మాత్రం కావాలి. కానీ ఆయన ఎంత సేపటికి రాడేంటీ.. ఎదురు చూస్తున్నాను. పిలుస్తున్నాను.. అబ్బా.. రామయ్యా మగడా.. పిలుస్తున్నాను. అహ.. అసలు రాడే.. ఎంత సేపనీ కూర్చోవాలి. ఎంత సేపని నిలబడాలి. ఎంత సేపని నడవాలి. త్వరగా రా.. చూసారా మీ అందరితో నా కథ అంతా చెప్పాకా కూడా ఈయనే రాడే.. అసలేంటీయన.. అని పరీక్షగా చూసాను. హాస్పిటల్‌లో బెడ్ మీద నన్ను పట్టుకుని ఆయన అచేతనంగా ఉన్నాడు. అంటే ఆయన కూడా భరించలేకపోయాడు. పరిగెత్తుకుంటూ కిందకి వెళ్లాలనిపించింది. ట్రై చేసాను.. అహా.. నా వల్లకావడం లేదు. ఉన్న చోటి నుండి అంగుళం కూడా కదలలేక పోతున్నాను. మరి నన్ను నేను చూసుకోగలుగుతున్నప్పుడు ఆయనెందుకు చూసుకోలేకపోతున్నాడు. ఏమండీ.. అని అరిచాను. నా చుట్టూ చూసాను. ఎవరూ లేరు. అంతా అంధకారం. నా చుట్టూ, ఆయన చుట్టూ చేరి అందరూ ఏడుస్తున్నారు. ఇంతలో నా భుజం మీద చేయి పడింది. పక్కన చూసేసరికి ఈయన ఆర్ద్రతతో నా కాళ్లలోకి చూస్తున్నాను. నన్ను పొదివి పట్టుకున్నాడు. ఇద్దరం కిందకు చూసాం. మా పిల్లలు కల్మషం లేకుండా ఏడుస్తున్నారు. నేను రాసిన ఉత్తరాలు వాళ్ల చేతుల్లో ఉన్నాయి. ఆయన్నీ, నన్ను విడదీయబోతున్న డాక్టర్లని వాళ్లు ఆపేసారు. మా శరీరాలని అలాగే వుంచి సమాధి చేయాలని మా పిల్లలు అనేసరికి అందకి కళ్లల్లో నీళ్లు అవే మాకు నిజమైన నివాళి అనిపించింది. ఒకరినొకరం చూసుకున్నాం. ఎన్ని జన్మలైనా ఈ ఆత్మీయత, బంధం విడకూడదని ఒకరి చేతులను ఒకరం గట్టిగా పట్టుకుని శూన్యం వైపు పరుగుతీసాం.

*(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)*

# బాధలతోనే బతుకెళ్ళదీస్త

ఇల్లిడిసి....
కనిపెంచిన అమ్మనిడిసి...
అందరిలాగా జీవితాన్ని
ఎంజాయ్ చెయ్యడం ఇడిసి...
ఉద్యోగం రాకపోతే బతుకే లేదనుకుంటూ
బాధ పడిన రోజులెన్నో....
తినమని కడుపంటుంటే
సమయం వృథాఅవుతుందని
మనసంటుంటే..
ఆకలికొని చదివిన తీరు
నా కడుపుకే ఎరుక.
కళ్లేమో పడుకోమంటే....
పడుకుంటే పోటీలో వెనకబడి పోతానని
నిద్రలేని రాత్రులు గడిపి
చదివిన రోజులెన్నో...
చూపంతా ఉద్యోగ ప్రకటనలపైన
పండుగ లేదు పబ్బం లేదు
ఉద్యోగం ఒకటే లక్ష్యం.
నాన్నేమో పని జెయ్యమంటే.....
అమ్మేమో పెళ్లి జేసుకొమ్మని అంటే.....
పనికెళ్తే అనుభవం అడిగే.....
పెళ్లంటే ఉద్యోగం అడిగే.....
ఎటు తెల్వని బ్రతుకై పాయే
నిరుద్యోగి జీవితమంతా.......
ఉద్యోగం రాక బాత్రూంలో ఏడ్చిన క్షణంలో
నా గుండె చెప్పిన ధైర్యంతో
ఈ రోజు నా బతుకీడుస్తున్న ...
లేదంటే ఈ దేహం ఏనాడో పీనుగై
నేను తలగోర్వి పెట్టాల్సిన
మా నాన్నతో తలగొర్వి పెట్టించుకునేది.
చుట్టూవున్న వాళ్ళు నాన్నని
నీ కొడుకు ఇంగా
ఎన్నేండ్లు సదువుతడు
అని అడిగినప్పుడు
నాన్న నన్ను ఎనకేసుకొస్తే
అప్పుడు బతకాలనిపిచ్చింది
నాన్న కోసం
అమ్మ కోసం.
ఇన్ని బాధలు భరించిన
ఇంతకంటే బాధ ఇంగయాడుండది.
నన్ను కనిపెంచిన తల్లిదండ్రుల కోసం
ఈ బాధలతోనే బతుకెళ్ళదీస్త.......



-మల్లుయాదవ్ బైకని
8096152687

# చెమటను నమ్మితే..

తడి బట్టను పిండితే నీరొస్తుంది
కాయకష్టం చేస్తే చెమటతో..
దేహం తడిసి ముద్దవుతుంది
నీ చెమట పక్కోడికి కంపు కావచ్చు
నీకు అదో సువాసనల అక్షయపాత్ర !.
నేలకు నీరందిస్తే పంటోస్తుంది
ఒంటిని చెమటతో తడిపితే..
అపూర్వ విజయం వరిస్తుంది
చెమట నీ విజయ ఇంధనం !.
చెమట కక్కినోడి శరీరం..
ఆయురారోగ్య సౌభాగ్యం
చెమటను దాచినోడి దేహం
సకల రోగాల కేరాఫ్ అడ్రస్ !.
చెమటను నమ్మినోడు..
చెట్టంత ఎదుగుతాడు
ఇతరుల చెమటపై ఆధాపడ్డోడు..
పరాన్న జీవిగా మిగిలిపోతాడు !



-మధుపాళీ
9949700037

# స్లీపర్ కిల్లర్

కాలం కఠిన పరీక్ష వేటలో
చిమ్మ చీకటి రహదారి బాటలో
సుదూర ప్రయాణపు నిదురలో
హైవే పై అతివేగం గారడీ తప్పి
మృత్యు ఘోషై కబలించేను.
గమ్యానికి చేరవాల్సిన ప్రయాణంలో
నిర్లక్ష్యపు అతివేగం ఓ వైపు
ఓవర్ కాన్ఫిడెన్స్ ఓ వైపు
త్వరగా వెళ్ళాలని తలంపు మరో వైపు
ముందు చూపు సన్నగిల్లి
గాలి కొదిలేసిన ప్రాణాలు.
పొరపాటుతో గ్రహపాటుగా
కటిక చీకటిలో బైక్ తగిలి
రసాయనాల రాపిడిలు చేలరేగి
క్షణాల్లో అగ్గిరవ్వల సేగలతో
హాహాకారాల రణ ధ్వనులతో
నిప్పుకణికల ఊచల చువ్వలకు
బూడిదలో మనుషులు బుగ్గిపాలు .
మృత్యుకేళిలో నల్లని పొగలు
మిన్నంటిన కన్నీటి రోదనలు
దుంఖపు నదిలా కన్నవాళ్ళు
చెమ్మగిల్లిన మనసుల ప్రాణాలు.
స్లీపర్ కిల్లర్ తో మృత్యు శకటం
గుండె చెదిరిన పునాదులు
చిన్న పెద్ద తేడా తెలియని మరణాలు
సజీవ దహనానికి నిలువెత్తు సాక్ష్యాలు



-డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

# అడవి బెంగ పడ్తాంది


వనంతో చెలిమి చేసే వేగు చుక్కలు
అడవి తల్లికి సెలవు చీటి రాస్తుంటే
ఇప్పుడు వనవంతా బెంగ పడ్తాంది
చిగురించే ఆకులన్నీ చిన్న బోయి
చిరాకు పడుతున్నయ్
వాగువంకలు నిరసన రంగును
కసిగా అద్దుకొని తన శబ్దాలకు
తాలం వేసినయ్
ఇప్పుడు అడవినంతా నిశ్శబ్దపు నిశీధి
నిలువునా మింగేసింది
కలియ తిరిగిన పాదాలు కానరాక
తరువుల తనువులు
భారంతో బరువెక్కుతున్నయ్
పాటలకు కోరస్ పాడే కోయిలలు సైతం
తన స్వరాలను గుహల్లో దాచి పెడ్తున్నయ్.
పిడికిలెత్తి చైతన్యపు విత్తనాలను నాటిన
చేతుల కోసం గాలి తీవ్రంగా గాలిస్తుంది
సమరపు పాఠాలు నేర్పిన సైనికుల కోసం
పుష్పాలు పుప్పొడిని పుడమిపై చల్లుతున్నయ్
గూడెం బతుకులకు పచ్చ బొట్టై నిలిచిన
దివిటీల కోసం తుమ్మెదలు సైతం
ఆత్రంగచూస్తున్నాయి.



-తాటిపాముల రమేశ్
7981566031

# కుమారా!

ముందుకు సాగు వెనక్కు మళ్ళకు
ప్రక్కకు వెళ్ళకు ఎగాదిగా చూడకు
ఉరుములకు దడువకు పిడుగులకు బెదరకు
హెచ్చరికలు లెక్కచేయకు మందలింపులకు భీతిల్లకు,
గమ్యం వీడకు యత్నం ఆపకు
పయనం మానకు ఆశయం సాధించు
మాటలు ముత్యాలు చక్కగా ప్రయోగించు
తియ్యగా నుడువు తెలివిగా ప్రవర్తించు,
నవ్వులు చిందు పువ్వులు చల్లు
మోములు వెలిగించు మదులు మురిపించు
ప్రేమను పంచు పరిమళాలు వెదజల్లు
వెలుగులు చిమ్ము ఆనందాలు అందించు.
గోతులు తీయకు క్రిందకు తోయకు
క్రోధము చూపకు పంతాలు పట్టకు
చక్కగా ఆలోచించు మంచిని తలపెట్టు
సమాజశ్రేయస్సుకు పాటుపడు
సంఘానికి తోడ్పాటందించు.
అన్యాయాలను ఎదురించు అక్రమాలను ఖండించు
అవినీతిని అంతరించు
అబద్ధాలకోరులను దూరంపెట్టు
గెలుపుకు పొంగిపోకు ఓటమికి కృంగిపోకు
గర్విష్టివి కాకు సహనము వహించు.



-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
7981616630

# హైకూలు

అందరిళ్ళల్లో
ఇలవేల్పులిద్దరు
అమ్మా నాన్నలు.

నిప్పుకి గర్వం
నీటిని చూస్తే మాత్రం
చచ్చేంత భయం!

కవ్వం సవ్వడి
మాయమయిపోయింది
పాలు అమ్మకంతో.

వనాలవైపు
మబ్బుల పరుగులు
జలకాలాటకు.

మండే గుండెలు
తుది సమరం దాకా
చెండాడుతాయి.

గాన కచేరి
మామిడి కొమ్మ మీద
కోకిల రాగం.

పల్లె పిల్లలు
కలువ పువ్వులుగా
ఊరి చెర్వులో.

కుంభ వృష్టితో
బలే శుభ్రపడింది
మురికివాడ.

అలలు వచ్చి
పరువు పరిచింది
సాగరతీరం.

పాల వ్యాపారి
వాటర్ బాటిల్ కొన్నాడు
వ్యాపార వృద్ధి.

నదిలో పడి
గిలగిలలాడ్తున్నాడు
చంద మామయ్య.

మంచి తనాన్ని
'డ్రా' చేసుకుంటుంటారు
ఏ.టి.యం.వలె.

దాగుడు మూతా!
మబ్బుల్లో చందమామ
తొంగి చూస్తుండు.

అనురాగాలు
మాయని మమతలు
వీడని బంధం.



- బొబ్బిలి జోసెఫ్
సెల్:9989261991

# వెలుగు

నీ చూపుడు వేలు నీకు వెలుగులు
నీ ఆలోచనలే నీకు ఆదర్శం
నీ మాటలే నీ నిజాయితీ
నీ నడవడికే నీ కుటుంబానికి ఆసరా.
నీ నమస్కారం ఎదుటివారికి సంస్కారం
రాయిలా కూర్చున్న రాయి
విగ్రహమై చేతులెత్తేలా
విలువైన నమస్కారం పెట్టిస్తుంది.
కొన్ని ఉదయాలు ఆనందాల వెల్లువలు
కొన్ని నిమిషాలు మనసుకు ఊపిరిలా
కొన్ని మాటలు నిశ్శబ్దానికి అర్థమై
కొన్ని చిరునవ్వులు ప్రయాణానికి వెలుగై.
మనిషి నిలిచేది అడుగుల వల్ల కాదు
మనసు పెట్టిన మంచి వల్ల
అదే నీ శక్తి
అదే నీ నీడలో నిలిచే
వెలుగు.



-ఎలాగొండ రవి
9848770345

# నానీలు

పచ్చదనంపై
గొడ్డలి వేటు
భావి తరానికి తప్పదు...
శ్వాస పోటు!

ఎంత కావాలో
అంత తోడుకో
జ్ఞానం....
ప్రవహించే నదీ ప్రవాహం!

తరాలు మారినా
మారని దొకటే
మాతృ ప్రేమలో...
తరగని మాధుర్యం!



-ఎస్. ఎం. సుభాని
9490776184

# రజకో రక్షతి రక్షితః...!

రజకరహితులైన రమ్యత వలువల
శుభ్రతేది.. చూడ చోద్యమేను
ఆడపిల్లయనగ యామెయేమొదలు
ఊరిబట్టలన్ని వుతుకుతాను!?

రజకులిలను వున్న రాజిలువస్త్రాలు
ప్రజకుసేవ జేయు భాగ్యశాలి
చాకలమ్మ వుతుకు చక్కగాబట్టలు
వేసుకున్నచాలు వెలుగులీను!

ముట్టు మురికి గల్ల ముదితలబట్టలు
ఉతికి పంచుదురిల వుత్తమముగ
చెరువు కెళ్ళి తాము చేవతోవుతికేరు
వీరి సాటి లేరు వింతగాదు!

వరిబట్టలేవొ యేర్చుకొనియుకూర్చి
ఇంటి యింటి కిలను యింపుగాను
అందజేతురయ్య యంకెలుదప్పక
గణిత గురువు కన్న ఘనులు వీరు!

కాన్పు బట్టలన్ని కరుణతో వుతికేరు
చావు రేవు వద్ద కలసి పనులు
మైలయనక తాము మానవీయభావన
సామరస్యముండి సాగువారు!

ఇంటి ఖర్చులకిల యిచ్చిన సొమ్మును
ఆడమగయు కల్సి యందుకొంద్రు
రజక జాతి లేక రాణించు నావూళ్ళు
ఇస్త్రి వలువలకును యివ్వరూక!

ఆదరించవలెను యవసరములుదీర్చ
పల్లె పట్నమందు పదిలముగను
అండదండలుండి యాదుకొనుటమేలు
కోటి విద్యలన్ని కూటి కేను!!!



-డా॥గన్నోజుశ్రీనివాసాచారి
8555899493

# తెలంగాణ విప్లవ సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్



భావ కవిత్వమైతే పాఠకులకు ఆనందాన్ని, వినోదాన్ని కలుగుజేస్తా యి.ప్రకృతి కవిత్వామైతే ఊహాతీత సేలయేటి నదులపై తేనెలూరు కవి త్వమై పరవశింప జేస్తాయి. సామా జిక అభ్యుదయ అభ్యున్నతికి రాసే కవిత్వమైతే అలజడిని ఆక్రోశాన్ని రోమాలు నిక్క పొడుచుకునేలా మనసును పొంగి పొర్లేలా అంతర్లోచన తరంగాలు ప్రవాహించేలా చేస్తుంది. అటు వంటి కవిత్వాన్ని ఆవపోసిన పట్టిన అభ్యుదయ అక్షర శిఖరం అలిశెట్టి ప్రభాకర్.

కుంచెని, కెమెరా లెన్సుని, కలాన్ని ఏకం చేసి తెలుగు కవితకు పుష్టి చేకూర్చి, అనేకమైన కవిత పంక్తులతో సంక్షిప్తతనీ, వస్తువులో జీవిత విస్తృతినీ, సమాజ లోతుల్నీ, నర్మ గర్భంగా పదునైన పంక్తులను నరనరాల్లో రుధిరాన్ని కాల్చే కొలిమిలా, విస్ఫోటనం గావించిన సామాన్య అక్షర మాంత్రికుడు. గజ్జె కట్టి కరాళ నృత్యం చేస్తున్న క్షుద్ర రాజకీయలపై ఉక్కుపాదాన్ని తూటాల్లా పేల్చిన సమర శంఖం. ఆకాశమంతా అనంత భావాల్ని , నవయుగానికి ధిక్కార కవిత్వముతో స్ఫూర్తి రగించిలించిన సాహిత్య ప్రభాకరుడు. సామాజిక రుగ్మ తలపై ,విప్లవ కిరణాల ప్రసరింపచేసి కష్టజీవి కన్నీటి చెమట చుక్కలను చరిత్ర రక్తాక్షరాలతో చురకలను ఆంటించి ,జనుల నాడులను తదైక దూర దృష్టితో దర్శించి బాధితుల పక్షాన నిలబడి గుండెల్లో గుచ్చుకు నేలా చెంప చెళ్ళుమనేలా సూటిగా వాడుక పదాలతో వ్యక్తపరచి ప్రభజంనం సృష్టించిన నిత్య కార్మిక అక్షర భాస్కరుడు అలిశెట్టి ప్రభాకర్.

**అలిశెట్టి జనన ప్రస్థానం**

1954 జనవరి 12 న జగిత్యాల లో అలిశెట్టి చినరాజం,లక్ష్మి దంప తులకు జన్మించాడు. భార్య భాగ్య, కుమారులు సంగ్రామ్, సంకేతులతో నివాసం. యుక్త వయస్సు లోనే మొదట పత్రికలకు, సినీ నటుల బొమ్మ లను గీస్తూ ఆర్టిస్ట్ గా ఎదిగాడు. తర్వాత సాహితీ మిత్ర దీప్తి పరిచ యంతో కవిత్వ రంగంలోకి ప్రవేశం చాడు. జీవనం కోసం జగిత్యాలలో స్టూడియో పూర్ణిమ , కరీంనగర్ జిల్లా లో స్టూడియో శిల్పి, హైదరాబాద్ లో స్టూడియో చిత్రలేఖ ఏర్పాటు చేసి ఫోటోగ్రాఫర్‌గా జీవిత ప్రస్థానం సాగి ంచాడు. కుంచె బొమ్మల్నీ, కెమెరా బంధించిన ఫోటోల్నీ తన కవిత్వానికి ఆసరా చేసుకున్నాడు. తాను చెప్పే భావాల్నీ వెలిగించే దివిటీలుగా మార్చుకున్నాడు. తన కవిత్వ అక్షరాల తో సృజనాత్మకతతో సునాయాసంగా ప్రజలకు అర్థమయ్యేలా, నిర్మోహ మాటంగా కలంతో అక్షర సిరాలను అందించడం చేశాడు.

**జన సామాన్య బాధలే కవిత్వ వస్తువుగా**

విభిన్నమైన కవిత్వాలు వెలువడు తున్న సమయంలో పేదరికంలోని మరింత పేదరికానికి, బాధల నుండి మరింత బాధలకి కన్నీళ్ళను కవితా వస్తువుగా చేసుకొని కవితలు రాశాడు. ఎర్ర పావురాలు, మంటల జెండాలు, చురకలు, రక్తరేఖ, ఎన్నికల ఎండమావి, సంక్షోభ గీతం, సిటీలైఫ్ మొదలలైనవి రాశాడు.

**ఆయన రచనల్లోని కవిత పం క్తులు**

అలిశెట్టి ప్రభాకర్ కవితల పుస్తకంలోని మచ్చుతునక రవ్వలు కొన్ని ...

**గొంతు కోస్తే /పాట ఆగిపోదు / అది..ముక్తకంఠం /గొలుసు లేస్తే /పోరు నిలిచిపోదు / అది.. ప్రజా యుద్ధం ...** అని ఒక కళాకారుడి మీద హత్యాయత్నం జరిగినప్పుడు చలించి అతని సిరాలోంచి జనించిన కవిత్వ పంక్తులివి.

**'భయం'** అనే కవితలో బాంబుని **చూడగానే / బెంబేలు పడితే / అదే ప్పుడూ / నీ గుండెల్లోనే పేలుతుంది..** అని దేనిని చూసి భయాందోళన చెందకూడదని ధైర్యాన్ని భయపడితే అది నీ గుండెల్లోనే రోజు పేలుతుందని ఉద్ఘాటించారు.

**తన శవమై / ఒకరికి వశమై / తనువు పుండై /ఒకడికి పండై / ఎప్పుడూ ఎడారై / ఎందరికో ఒయాసిస్సై** ...ఒక వేశ్య గురించి ఇంత గొప్పగా ఏ కవి చెప్పలేదని చిన్న పంక్తులతో అనంత భావాల్ని కవితలను పేర్చడం ఒక్క అలిశెట్టి ప్రభాకరుడికే సాధ్యమని నిరూపించిన తెలంగాణ అక్షర ఆయుధ రాకెట్.

మరో కవితలో... **దేవుళ్ళు తమ గుళ్ళకి రాత్రిళ్ళంతా/తాళాలు వేసుకుం టున్నారెందుకో/బహుశా మనుషుల మీద నమ్మకం పోయిందేమే..!** అని నిర్మోహమాటంగా వ్యక్త పరుస్తాడు. **న్యా యాన్ని ఏ కీలు కా కీలు / విరగొట్ట గలవాడే వకీలు (వకీలు), కోచింగ్ లేని మ్యాచికి / చప్పట్లు కొట్టే సన్నాసులు (సిని మాలు-ప్రేక్షకులు) కొవ్వెక్కి ఉ ఒడటం /కొవ్వొత్తులూదటం (బర్త్ డే పార్టీలు)**...మొదలగు చురకలు అందించారు.

నగరాల్లో అత్యధికంగా/ అత్యద్భు తంగా/ ఆస్థి పంజరాల్ని చెక్కే /ఉలి /ఆకలి ...హైదరాబాద్ నగరంలో బతు కు కోసం వచ్చి ఎన్నో ఇబ్బం దులకు గురైవుతూ ఆకలి నింపు కోవడం కోసం, బతుకు సాగడం కోసం అహర్నిశలు శ్రమించే పేద మధ్య తరగతి మనోగథాలను అద్భుతంగా ఆవిష్కరించారు అలిశెట్టి ప్రభాకర్. మరో కవితలో... **గడియారం పెట్టుకున్న./ ప్రతివాడూ / పరిగెడుతున్న / కాలాన్ని / పట్టుకోలేడు...కుక్కలూ లేని /కుక్కరూ లేని / ఇల్లే - ఒకింత ప్రశాంతత... విద్యార్థుల ఎగుమతి / నిరుద్యోగుల దిగుమతి / చేయగల / చదువుల రేవులు / యూనివర్సిటీలు... చెక్కు/ చెదరని / చెక్కు బుక్కులా / నువ్వు/ నలిగిపోయిన/ రేషన్ కార్డులా/ నేను** అంటూ పేదరిక దినావాస్థ జనుల నాయకుల పోలికను చమత్కార పరిమతో అంటూ..**'సిటీలైఫ్'** సంకలనంలో కవితలు రాశాడు.

ఏ కవిత రాసిన దానిలో అస్థిత్వం, పరమార్థంతో నిజ నిజాలను నర్మగ ర్భంగా గోచరిస్తుంది. నిజ నిజాలను రాయడంలో అందెవేసిన చెయ్యి. కవిత్వమునే శ్వాసగా ఆశగా అనుభూతి, భక్తి ,ముక్తి ,సరసం వినోదానికి పరిమి తమైన పాఠకుల మనసులను ప్రగతిశీల ఆలోచనా ధృక్పథంలోకి మళ్ళించగల నేర్పరి అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వర్తమాన కవిత్వానికి కాయినేజ్ పెంచిన కవినతడు. కవిత్వముతో తను తానుగా వుండిపోతూ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా టీబీ సోకి ఒంటిని కబళిస్తున్నా లెక్క చేయలేదు. ఆరోగ్య విషయంలో చాలా నిర్లక్ష్యంగా ఉండేవా డని అలిశెట్టి దగ్గరి మిత్రులు చెబుతుంటారు. ఎన్నో అద్భుతమైన కవితలను శిల కాగితంపై అక్షరాల ఉలితో చెక్కి చెదరనివ్వని ముద్రలా నిలిచిపో యాడు.

**డబ్బు మనిషిలా నువ్వు / జబ్బు మనిషిగానేను /**

**అందుకే... / నువ్వెప్పుడు డాక్టరువి / నే పేషెంటుని** అంటూ వ్యంగంగా రాయడంలో దిట్టగా అనిపించుకు న్నాడు.

**నాకేమీ తెలియదు అన్నం ఎట్లా ఉడికించాలో తనకు తెలుసు / దగ్గు తెరల నెత్తుటి రెపరెపల ఊపిరి తిత్తుల్తో కవిత్వమెట్లా రాజేయాలో నాకు తెలుసు** అంటూ భార్య భాగ్యలక్ష్మి మీద అమితమైన హృదర ప్రేమను తెలియజేస్తాడు. హృదయ త్రాసు కవితలో ..**తెలవార్లూ పరిచర్యలు చేసే నా భాగ్యమే / నా కన్నీళ్లని తూచే సున్నితపు హృదయత్రాసు / నేను ,ఆమె / నిశ్శబ్దపు వేదనా తరంగాల్ని కొలిచే భారమితిని** అని అద్భుతమైన భావోద్వేగాలతో అల్లిన అక్షరాలు చిరస్మరణీయంగా నిలిచిపోయే విధంగాఅనేకమైన మినీకవితాలు రాస్తూనే..సాహిత్య చరిత్రలో బహుశా జయంతి, వర్ధంతి జరుపుకునే ఏకైక అక్షర ప్రేమికుడు అలిశెట్టి ప్రభాకారు డొక్కడే. 1993 జనవరి 12 న కన్నుమూసిన పదునైన అక్షర సూరీడు అమరుడైన అలిశెట్టి ప్రభాకరుకు జోహార్లతో సాహిత్యాభి వందనములు అందించడం, స్మరిం చుకోవడము మనందరి కర్తవ్యం.

(నేడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి - వర్ధంతి సందర్భంగా )



**-డా॥పగిడిపల్లి సురేందరు**
80748 46063

# అత్యద్భుత ఆవాస నిలయం - భూగ్రహం

08 జనవరి 1851 శుభ వేళ 'లియోన్ ఫౌకాల్ట్' అను ఫ్రెంచ్ శాస్త్రజ్ఞుడు భూగ్రహం తన చుట్టు తాను తిరుగుతున్నదని ప్రయోగాత్మకంగా రుజువు చేసిన సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 08 జనవరి రోజున ప్రపంచ మానవాళి ''భూభ్రమణ దినోత్సవం'' ఘనంగా నిర్వహించుకుంటున్నది. భూమి తన చుట్టు తాను భ్రమణం చెందుటను "పౌకాల్ట్ పెండ్యులమ్ (లోలకం)" సహాయంతో సరళ పద్ధతిలో రుజువు చేసి శాస్త్రవేత్తల మన్ననలు పొందారు. నేటి ప్రపంచవ్యాప్తంగా అన్ని మ్యూజియమ్‌లు, అబ్జర్వేటరీలు, యూనివర్సిటీల్లో ఒక సర్వ సాధారణమైన ప్రయోగ పరికరంగా పౌకాల్ట్ లోలకం యువతకు శాస్త్రపరిశోధనల స్ఫూర్తిని రగుల్చుతున్నది. భూగ్రహం ఆత్మ ప్రదక్షిణాన్ని కోల్పోతే భూమి మీద ఏమీ మిగలదని తెలుసుకోవాలి.

భూమి తన చుట్టు తాను భ్రమిస్తూనే, సూర్యుని చుట్టు కూడా తిరుగుతున్నదనే విషయం మనకు తెలుసు. భూమి తన చుట్టు తాను తిరగడానికి 24 గంటల సమయం పట్టడం వల్ల ఈ సమయాన్ని ఒక దినంగా లెక్కిస్తున్నాం. అదే విధంగా సూర్యుని చుట్టు భూమి తిరగడానికి 365 రోజులు పడుతుండడంతో ఆ కాలాన్ని ఒక సంవత్సరంగా పరిగణిస్తున్నాం. భూభ్రమణం వల్ల రోజులు మాత్రమే కాకుండా సీజన్స్ కూడా ఏర్పడున్నాయని గమనించాలి. భూభ్రమణ దినం రోజుల విద్యాలయాలు, సైన్స్ మ్యూజియమ్స్ కేంద్రాలుగా విద్యార్థులకు సవిరంగా వివరించడం కొనసాగుతున్నది.

భూగ్రహ అద్భుత విశేషాలు:

భూమి మీద దాదాపు 70 శాతం వరకు నీరు ఆక్రమించింది. భూగ్రహంపై ఉన్న నీటిలో 97 శాతం లవణ జలము ఉండగా, కేవలం 3 శాతం వరకు మాత్రమే మంచి నీరు లభిస్తున్నది. భూమిలో అధిక శాతం ఇనుము, ఆక్సీజన్, సిలికాన్ మూలకాలకు సంబంధించిన ఖనిజాలు ఉన్నాయి. భూమి లోపల ఉన్న ద్రవ రూప ఇనుప ఖనిజాల వల్ల భూమికి ఆకర్షణ శక్తి జనించిందని, లేనిచో భూమి ఉపరితలంపై జీవకోటి మనుగడ అసాధ్యం అయ్యేది. భూమి ఏర్పడి దాదాపు 4.5 బిలియన్ సంవత్సరాలు అయిఉండవచ్చని అంచనా వేశారు. సూర్యమండలంలోని భూగ్రహంపై మాత్రమే ప్రాణుల మనుగడకు అనువైన వాతావరణం ఉందని తెలుసుకోవాలి. భూగ్రహం చుట్టు సహజ ఉపగ్రహం చంద్రుడు తిరుతున్న విషయం కూడా మనకు విధితమే.

అంతరిక్షం ఓ అద్భుతాల వేదిక. అనంత అంతరిక్షంలో లెక్కలేనన్ని నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, ఇతరములు అనేకం ఉన్నాయి. అంతరిక్షం అంతుచూడడం మనిషికి అసాధ్యమే. అంతరిక్ష పరిశోధనలకు అంకితభావంతో జీవితాలను అర్పిస్తున్న ఆస్ట్రానమర్స్, ఆస్ట్రోనాట్స్, అంతరిక్ష శాస్త్రజ్ఞులకు మనం కృతజ్ఞతలు తెలియజేద్దాం, భూమిని ఒక అద్భుత నివాసయోగ్య గ్రహంగా గుండెల్లో పెట్టుకొని కాపాడుకుందాం.

(08 జనవరి:"భూభ్రమణ దినోత్సవం" సందర్భంగా)



**-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# గుడిలో భారీ చోరీ.. ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

హైదరాబాద్, జనవరి 7: హైదరాబాద్ నగరంలోని ఆలయంలో భారీ చోరీ జరిగింది. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల యంలో దొంగలు స్వామి వారి నగలను చోరీ చేశారు. సుమారు రూ.50 లక్షల విలువ చేసే ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. దుండ గులు అర్ధ రాత్రి సర్దార్ పటేల్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి ప్రవేశించారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి విగ్రహంపై ఉన్న రూ.50 లక్షల విలువైన వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచా రం అందించారు. గుడి దగ్గరకు చేరుకున్న పోలీసులు క్లూస్ సేకరిస్తున్నారు.

## అతడు

అతడు కష్టించకుంటే
ప్రజావళికి భుక్తి లేదు
అతడు ఆరాధించకుంటే అందానికి అర్థం లేదు.
భౌతిక దేహంలో జీవాత్మ అతడు
ఆలిని అమ్మగా మలిచి ఉన్నత స్థానంలో నిలిన శిల్పి అతడు.
అతను లేని ఆమెకు సంతృప్తి లేదు
అతని చెయ్యి తాకితేనే ఆమె పులకిస్తుంది
అతడు ఆమెలో సగం అయితేనే ముందు తరం సమాజం వికసిస్తుంది
అప్పుడే ఆమె ఉన్నత స్థానం అలంకరిస్తుంది.
ఆమె విలువైన సువర్ణం
అతనితో చేరితే అద్భుతమైన ఆభరణం
అతడు లేని ఆమె అడవి కాసిన వెన్నెల.
ఆమె పుష్పం అతడు పరిమళం
సమాజ సాగరములో సాగే నావ అతడు
నావను నడిపే తెరచాప
ఆమే కానీ
ఆ తెరచాపను మోస్తున్నది నావే .
విశ్వ వేదిక పైన ఆమె రెపరెపలాడే సువర్ణ కేతనం నిజమే
కానీ రెపరెపలాడే ఆ కేతనం ఎగరడానికి
నిటారుగా నిలుచున్న కర్ర అతడు.



**-డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్**
7780143871

## చైతన్యం నింపిన శ్రీశ్రీ కవితా ప్రభంజనం




మాట్లాడుతున్న ఏనుగు నరసింహారెడ్డి. వేదికపై బండి శ్రీనివాస్, పొత్తూరి సుబ్బారావు, కళా జనార్ధనమూర్తి, బి. బాల సుష్మాదేవి

హైదరాబాద్, జనవరి 7: శ్రీశ్రీ కవితా ప్రభంజనం అనేక మందిలో చైతన్యాన్ని నింపిందని భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా॥ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో సోమవారం శ్రీశ్రీ యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని తన రచనలతో శ్రీశ్రీ మరో మలుపు తిప్పారన్నారు. సినీ పాటల్లో కూడా అవకాశం ఉన్న సందర్భాల్లో సామ్యవాద అభ్యుదయ భావాలు శ్రీశ్రీ జోడించారన్నారు. ప్రముఖ సాహితీవేత్త పొత్తూరి సుబ్బారావు, సంగీత గురువు, బి. బాల సుష్మాదేవి, గానసభ పాలకమండలి సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం

క్యాలెండర్ పేజీ మారిందని
కాలం నూతన మవదు;
మనసు లోతుల్లో
ఒక మృదువైన ఆలోచన
బలమైన తపనతో
మొలకెత్తిన క్షణమే
నూతన సంవత్సరానికి
నిజమైన ఆరంభం.
గతం
తప్పుల పుస్తకమైతే,
ఈ రోజు
ఖాళీ కాగితం.
నిన్నటి గాయాలు
మనల్ని బలహీనుల్ని చేయలేదు,
నడకను నేర్పాయి.
నిన్నటి ఓటములు
మన ముగింపు కాదు,
రేపటి విజయానికి
మార్గ నిర్దేశం చేసే సూచికలు...
క్రొత్త ఏడాది
మరింత సంపాదించాలనే
ఆశ కాదు,
మరింత మనిషిగా మారాలనే
సంకల్పం.
మాటల్లో తీపి,
చర్యల్లో నిజం,
కళ్లలో దయ?
ఇవే
మన నూతన తీర్మానాలు.
కాలం అడుగులు వేస్తూనే
ఉంటుంది,
మనం మాత్రం
మన విలువల్ని
ముందుకు తీసుకెళ్లాలి.
ఈ కొత్త సంవత్సరం
మన జీవితానికి
ఓ సంఖ్య కాదు?
మనం ఎలా జీవించాలో
గుర్తు చేసే
ఓ నిశ్శబ్ద ప్రమాణం

**-తీర్థాల అన్నపూర్ణ వేంకట శర్మ,** (హైదరాబాద్)



**-డా॥రావి రంగారావు**
9247581825

2024 జనవరి నుంచి ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.

"వారం వారం కవితల వర్క్ షాప్ 49" అంశం "నూతన సంవత్సరం"

ఈ పోటీకి 20 మంది కవులు తమ కవితలు పంపారు. 2 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.


## నూతనమై వచ్చింది!

బతుకు బడిలో నేర్చుకున్నవన్నీ
దినదినాభివృద్ధిలో జ్ఞానాలుగా విరబూసుకోమని
కాలం కొత్త పుంతలు తొక్కుతూ
నూతనమై వచ్చింది!.
తీపి మధురాల నవ్వుల పువ్వులతో
ధర్మానికి దిక్సూచిగా నిలబడమని
కాలం శక్తి యుక్తులతో పరిఢవిల్లి
నూతనమై వచ్చింది!.
ఉజ్వల భవిష్యత్తుకై
మమతల నిర్మాణం చేపట్టమని
కాలం కమనీయ సురాగంలా
నూతనమై వచ్చింది!.
జారుతున్న క్షణాలన్నీ
జ్ఞాపకాలుగా ఒడిసిపట్టుకోమని
కాలం భవిష్య వాణిలా బోధిస్తూ
నూతనమై వచ్చింది!.
శాంతి లోని సౌఖ్యాలన్నీ
ప్రేమ రుచులు పంచుతుందని
కాలం కొం కొత్త సమీరంలా
నూతనమై వచ్చింది!
మనిషి తనపు ఆనవాళ్లను
దైవత్వమై మొలిపించాలని
కాలం అమ్మ తనపు స్తన్యంలా
నూతనమై వచ్చింది!
మనసంతా నిర్మలమైతే
ధవళ కాంతులు పూస్తాయని
కాలం అంబరమై ప్రకాశించి
నూతనమై వచ్చింది!

**-చల్లా సత్యవతి**
కరాలపాడు, పల్నాడు

## ఆహ్వానం

**తిరుపతి జిల్లా రచయితల సంఘం**



ఆర్.సి.కృష్ణస్వామిరాజు నవల
**చింతల చేను**
పుస్తక ఆవిష్కరణ



సభాధ్యక్షులు: శ్రీ తోట వెంకటేశ్వర్లు, అధ్యక్షులు, తిరసం

పుస్తక ఆవిష్కరణ: ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం
తెలుగు శాఖాధిపతి, మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

పుస్తక సమీక్ష: డాక్టర్ కె. శ్రీనివాసులు రెడ్డి
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు

ఆత్మీయ అతిథి: డాక్టర్ డి. మస్తానమ్మ
పూర్వ అధికారభాషా సంఘం సభ్యులు,
వ్యవస్థాపక అధ్యక్షులు, శంకరంబాడి సాహితీ పీఠం

గౌరవ అతిథి: డాక్టర్ ఎన్. భీమన్న
తెలుగు శాఖాధిపతి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

తేదీ: 11-01-2026, ఆదివారం. సమయం: సా. 5.00 గం.
వేదిక: చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం, బైరాగిపట్టెడ, తిరుపతి.
సెల్: 9393662821

## పీచర సునీతా రావు 2025 సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

స్వర్గీయ పీచర సునీతారావు పేరుతో ఈ సంవత్సరం యథాక్రమంగా ఐదవ వార్షిక పురస్కారాలు ప్రదానం చేయడంకోసం పీచర సునీతా రావు ఫౌండేషన్ ,కవిత్వం, కథలు ,విమర్శ అనే మూడు సాహితీ విభాగాలకు సంపుటులను అహ్వానిస్తున్నది. మార్చ్2022 నుండి డిసెంబర్ 2025 వరకు వెలువడిన రచనలే పంపించాలి. ఇంతకంటే ముందుగాని తరువాత గానీ వచ్చిన రచనలు పరిశీలించబడవు. కవిత్వం,కథ,విమర్శలో ఎన్నికైన ప్రతి సంపుటానికి **మే 10,2026** న రవీంద్రభారతిలో పీచర సునీత సంస్మరణ తో జరిగే సభలో 15000 రు. నగదు మరియు సాహితీ ప్రముఖులతో సత్కారం ఉంటుంది.

రచయితలు ప్రతి విభాగంలో మూడు కాపీలు పంపించాలి.

-రచనలు మాకు చేరవలసిన చివరి తేది **ఫిబ్రవరి 25 ,2026**

## హన్మకొండలో వందేమాతరం 150వ వార్షికోత్సవ ఉత్సవాలు

వరంగల్, జనవరి 7: మహిళలు విద్యతో పాటు సామాజిక రాజకీయ రంగాల్లో మరింత ముందుకు రావాలని వరంగల్ పార్ల మెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. సరోజిని నాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ తదితర మహిళా నాయ కుల సేవలను స్మరించుకుంటూ ప్రతి విద్యార్థిని రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిలను స్ఫూర్తిగా తీసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు లభించిందని, ఈ గొప్ప అవకాశాన్ని దేశానికి అందించిన మహానుభావుడు డాక్టర్ బీఆర్. అంబేద్కర్ అని ఎంపీ కొనియాడారు. హనుమకొండలోని పింగళి మహిళ డిగ్రీ కళాశాలలో భారత సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించిన వందే మాతరం 150వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.


## కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
**'బుధవారం బాద్షా'**
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



### బాస చేద్దాం!

అదేంటి... ఇప్పుడొచ్చినట్టింది...
అప్పుడే వెళ్ళిపోతోంది!
తుడపలేని బలపం కట్టుకొచ్చి...
మనో ఫలకంపై ఎన్నో రాతలు రాసేసింది!
అవి మన రాతలా...
అదే గబగబా రాసిన విధి వ్రాతలా?!
కొన్ని అమోఘమైన మోతల్లా వున్నాయి!
కొన్ని అంతరార్థ దూతల్లానూ వున్నాయి!.
ఎందుకో... మరపు మనిషికి వరమైనా...
జరిగిన కీడును కాడిలా మోస్తూ...
నిన్నలో సున్నాలా మిగిలిపోతున్నాము!
రేపుకు లేని రూపాలు దిద్ది...
నేటిలో సుఖాన్ని తాకట్టు పెడుతున్నాము!
ఈ ప్రయాణాన మజిలీలన్నీ మెరుపులేనా?!
వెనకన దాగి ఉరుములూ వుంటాయి!
ఏదేమైనా... మనమంతా కాల ప్రవాహ తుంపరలం!
నిన్నటి అనుభవాలను రంగరించి...
రేపటి కాన్వాస్ పై తైల వర్ణ చిత్రంగా మలచి...
ముందు తరాలకు అందించే అన్వేషకులం!
మరో సంవత్సరం మారినా...
మారవు నెలలు..వారాలు!
మారని వానిలోనైనా మారతామని...
బాస చేస్తూ ఆహ్వానిద్దాం
మరో సంవత్సరాన్ని!

**-గుడ్లదొన సాయి చంద్రశేఖర్**
హైదరాబాద్

### మది ఆవేదన

ఎన్నో, ఎన్నెన్నో
సరదాలను, సంతోషాలను
చేదు అనుభవాలను
మాకు రుచి చూపించి
ఈరోజు నీకు
వీడ్కోలు పలకాలంటే
మదిలో ఏమిటో ఈ నిశ్శబ్దం.
విహారయాత్రలకు
ఆధ్యాత్మిక యాత్రకు
బంధుమిత్ర
సపరివారంగా వెళ్లి
ఆనందించిన శుభక్షణాలు.
మది పుటలో
మధుర జ్ఞాపకాలై నిలిచె.
ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని
విజయం సాధించే దిశగా
అడుగులు వేయించావు.
అంతులేని ఆనందాన్ని
మాకు పంచి
మౌనంగా నీవు
నిష్క్రమించే తరుణం
ఆసన్నమయ్యె.
వీడ్కోలు అంతం
కాదని తెలిసినా
చెప్పలేక చెబుతున్నా
మౌనంగా వెళ్లి రా
కొత్త సంవత్సరానికి
స్వాగతం పలికేముందు
నీతో ఉన్న జ్ఞాపకాలు
నా అంతరంగంలో
పరిమళాలు వెదజల్లే
మధురస్మృతులుగా నిండి
సదా నాకు గుర్తు
వచ్చే తీయని అనుభవాలు.
వారాలు నెలలు
అన్ని ఒక తైలవర్ణ
చిత్రంపై
అందంగా గీసి
నా జ్ఞాపకాల పరంపర
నా వారసులకు
కానుకగా అందిస్తా.
నవ్వు ఏడుపు కలగలిపి
వస్తుంటే,
నీకు వీడ్కోలు చెబుతున్నా.
కన్నీళ్ళతో వీడ్కోలు
నీకు 2025

**-రాచర్ల సులోచన**
హైదరాబాద్

### చెడుకు వీడ్కోలు, మంచికి స్వాగతం

గడచి పోతున్న వత్సరమా నీకు వీడ్కోలు
నీవు మిగిల్చిన బాధలను దిగమింగుతాను
నీవు అందించిన సంతోషాలను దాచుకుంటాను
రేపు రాబోయే నూతన వత్సరాన్ని స్వాగతిస్తాను.
ఎన్నో విషాదాలను కలిగించావు
కొన్ని ఆనందాలను అందించినావు
కాలగమనంలో నీవో చెరగని మైలు రాయివి
కలిగించావు ఎన్నెన్నో అనుభవాలను.
నీలో జరిగిన కుంభమేళా చరిత్రలో నిలిచిపోతుంది
కని విని ఎరుగని రీతిగా సాగిందిగా కుంభమేళా
గోవాలో మోడీగారు ప్రతిష్టించిన
శ్రీరామ విగ్రహం కన్నుల పండుగ చేసింది మాకు.
కర్నూల్, చేవెళ్ళ బస్సు దుర్ఘటనలు మాకందరికీ
కంటనీరును తెప్పించినవి
భాగ్యనగరంలో జరిగినట్టి
ఫుడ్ బాల్ మ్యాచి మరువలేనిది
చేదు సంఘటనలు మరచి
మంచిని యాదిలో ఉంచుకుంటా.

**-అక్కి నర్సింలు గౌడ్**

### విడిచే అడుగుల వెనుక మిగిలే వెలుగు

వీడ్కోలు
అంటే ముగింపు కాదు?
మనసు అంచుల్లో
జ్ఞాపకాల దీపం వెలిగించి
ముందుకు సాగమనే
నిశ్శబ్ద ఆహ్వానం.
కన్నీటి అంచున
నవ్వు నిలబడి
"మళ్లీ కలుద్దాం"
అనే ఆశను
హృదయంలో నాటుతుంది.
కాలం చేతిలో
చేతులు విడిచినా,
మన మధ్య నడిచిన మాటలు
మన ఊపిరిలోనే మిగులుతాయి.
వీడ్కోలు
బరువైన పదంలా అనిపించినా
అది కొత్త దారికి
తలుపు తెరిచే
మృదువైన తాళం.

**-రజని కులకర్ణి**

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com